భోలక్‌పూర్‌లో అగ్నిప్రమాదం

● ట్రాన్స్‌ఫారానికి మంటలు... భయాందోళనలో ప్రజలు


భోలక్‌పూర్‌లో ట్రాన్స్‌ఫారంకు అంటుకున్న మంటలు

ముషీరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ దేవునితోట వెనక వీధిలో గల బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద అర్ధరాత్రి చెత్తకుప్పలో మంటలు చెలరేగి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫారంకు అంటుకున్నాయి. మంటలు పెద్ద ఎత్తున వ్యాపించడంతో స్థానిక ప్రజలు అగ్ని మాపక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెండు ఫైర్ ఇంజన్‌లతో మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదమూ చోటు చేసుకోకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. మంటలు విపరీతంగా ఎగిసిపడడంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో విద్యుత్ తీగలు కాలిపోవడంతో శుక్రవారం తెల్లవారుజాము 4 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఏడీఈ సంపత్‌కుమార్, ఏఈ సంతోష్ ఆనంద్ విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్ ఘటనా స్థలానికి చేరుకుని అగ్ని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు.

డైమండ్ బెడ్స్ వర్క్ షాపులో అగ్నిప్రమాదం


డైమండ్ బెడ్స్ వర్క్ షాపులో షార్ట్ సర్క్యూట్‌తో అలుముకున్న పొగ

బర్కత్‌పుర, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిలక్‌నగర్ చౌరస్తా వద్ద డైమండ్ బెడ్స్ వర్క్‌షాపులో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో బెడ్స్ వర్క్ షాపు యజమాని, సిబ్బంది ప్రార్థన చేయడానికి మసీదుకు వెళ్లారు. తిరిగి వచ్చేసరికి పొగలు వస్తుండడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైరింజన్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో కొన్ని దూది పరుపులు కాలిపోయాయి. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

20న ఏపీ సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు


సమావేశంలో మాట్లాడుతున్న పి.సాయిబాబా

రాంనగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఈ నెల 20న నిర్వహిస్తున్నట్లు టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా తెలిపారు. శుక్రవారం పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 20న టీడీపీ నగర కార్యాలయంలో జన్మదిన వేడుకలు ఉదయం 9.30 గంటలకు కేక్ కటింగ్ చేస్తామన్నారు. టీడీపీ అభిమానులు, కార్యకర్తలు ఆయా నియోజకవర్గాలలోని ఆలయాలలో చంద్రబాబు కుటుంబం ఆయురారోగ్యంతో ఉండాలని ప్రత్యేక అర్చన, పూజలు చేయాలని కోరారు. మసీదు, చర్చిల్లో కూడా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, పేద విద్యార్థులకు స్వీట్లను పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

2బీహెచ్‌కేలో లిఫ్ట్‌కు మరమ్మతులు చేయిస్తా


పనిచేయని లిఫ్ట్ సమస్యను అడిగి తెలుసుకుంటున్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ తదితరులు

రాంనగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బాగ్‌లింగంపల్లి లంబాడీ తండాలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూం భవనంలో పనిచేయని లిఫ్ట్‌ను వెంటనే రీపేర్ చేయించేందుకు కృషి చేస్తానని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ తెలిపారు. ఈ సమస్యను జీహెచ్ఎంసీ కమిషనర్, ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీల దృష్టికి తీసుకెళ్లి లిఫ్ట్ రీపేర్ చేయించేందుకు కృషి చేస్తామన్నారు. శుక్రవారం లంబాడీ తండాలో ఆయన పర్యటించి స్థానికులతో కలిసి లిఫ్ట్ ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నవీన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు వేగవంతం చేయాలి


వరద నీటి కాలువ పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి

రాంనగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని వరదనీటి కాలువలో పూడికతీత పనులు వేగవంతం చేయాలని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. శుక్రవారం డివిజన్‌లో జరుగుతున్న పూడికతీత పనులను బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆమె పరిశీలించి, మాట్లాడారు. వర్షా కాలం ప్రారంభం కాకముందే పూడికతీత పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు మిరియాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



బైబిల్‌లోని దైవ సందేశాన్ని అందిస్తున్న ఆలిండియా ప్రేయర్ పవర్ చర్చిస్ డైరెక్టర్ శ్యామ్ అబ్రహం, ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఏసుప్రభు శిలువవేసిన రోజు అయిన గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం క్రైస్తవులు చర్చిలకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్లు ఏసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను వివరించారు. ఏసు ప్రభు భక్తి గీతాలను ఆలపిస్తూ ప్రార్థనలు చేశారు. రాంనగర్ ప్రేయర్‌పవర్ చర్చ్, ప్రార్థన వీరుల చర్చి, యునైటెడ్ ఫెలోషిప్ చర్చి, తదితర ప్రాంతాల్లోని చర్చిలలో క్రైస్తవులు పెద్దఎత్తున హాజరై భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ప్రేయర్‌పవర్ చర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహా, పాస్టర్ బ్రహ్మం, బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్, పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గం మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, తదితరులు హాజరయ్యారు.


భారీ వర్షానికి వీఎస్టీ చౌరస్తాలో జలమయమైన రోడ్డు

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో

భారీ వర్షం

● రోడ్లు జలమయం ● ట్రాఫిక్ ఇబ్బందులు

రాంనగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. ముషీరాబాద్ నియోజకవర్గంలోని రాంనగర్ నుంచి వీఎస్టీకి వెళ్లె మెయిన్ రోడ్డు, ఆర్టీసీ క్రాస్‌రోడ్, బస్‌భవన్ రోడ్డు, ఆర్టీసీ కళాభవన్ చౌరస్తా, అశోక్‌నగర్ చౌరస్తా, కవాడిగూడ ప్రాగా రోడ్స్, పద్మాకాలనీ ప్రాంతాల్లో వరదనీరు వచ్చి రోడ్లు జలమయంగా మారాయి. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులుపడ్డారు. పలు కూడళ్లల్లో జీహెచ్ఎంసీ ఎమర్జెన్సీ స్క్వాడ్ వర్షం నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని చేనెంబర్ చౌరస్తా, బతుకమ్మకుంట, మల్లికార్జున్‌నగర్, టూరిస్ట్ హోటల్‌చౌరస్తా, నింబోలిఅడ్డ, గోల్నాక చౌరస్తా, అంబర్‌పేట సీపీఎల్ మెయిన్ రోడ్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షంతో రోడ్లు జలమయంగా మారాయి. దీంతో కొద్ది సేపు ఆయా ప్రాంతాల్లో రాకపోకలు స్తంభించిపోయాయి. ఎట్టకేలకు జీహెచ్ఎంసీ ఎమర్జెన్సీ స్క్వాడ్ ఆయా ప్రాంతాలకు చేరుకుని వరద నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు.

కూలిన 50 ఫీట్ల నాలా ప్రహరీ


చిక్కడపల్లి సూర్యనగర్‌లో కూలిన హుస్సేన్‌సాగర్ నాలా ప్రహరీని పరిశీలిస్తున్న రాంనగర్ కార్పొరేటర్ రవిచారి

కురిసిన భారీ వర్షానికి రాంనగర్ డివిజన్‌లోని చిక్కడపల్లి సూర్యనగర్ బస్తీ వద్ద హుస్సేన్‌సాగర్ నాలా ప్రహరీ కుంగి దాదాపు 50 ఫీట్ల పొడవునా కూలిపోయింది. అంతేకాకుండా రోడ్డు సగం వరకు కుంగి, ప్రమాదకరంగా మారింది. దీంతో స్థానికులు ఈ ప్రమాదాన్ని గ్రహించి, రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారికి ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే జీహెచ్ఎంసీ ఎమర్జెన్సీ స్క్వాడ్‌తో అక్కడికి చేరుకుని, కూలిన చోట బారికేడ్లను ఏర్పాటు చేశారు. దీంతో వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కె.రవిచారి మాట్లాడుతూ బాగ్‌లింగంపల్లి నుంచి నారాయణగూడ బ్రిడ్జి వరకు నాలా ప్రహరీ పూర్తి ప్రమాదకరంగా మారిందన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే తరచూ ఈ ప్రాంతంలో నాలా ప్రహరీ కూలిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఇలాంటి సమయంలో పునరావృతం కాకుండా జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

నేలకూలిన చెట్లు

ముషీరాబాద్/చిక్కడపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో వర్షం పడింది. వర్షపునీరు రోడ్లపై ఏరులై పారడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ముషీరాబాద్‌లోని లోతట్టు ప్రాంతాలైన పార్శిగుట్ట, బాపూజీనగర్, వినోభానగర్, సాగర్‌లాల్ ఆస్పత్రి వీధి, భోలక్‌పూర్‌లోని అంబేడ్కర్‌నగర్, తదితర ప్రాంతాలలో వర్షంనీరు నిలిచిపోవడం వల్ల ప్రజలు ఇబ్బందిపడ్డారు. దాయార మార్కెట్ నుంచి సాగర్ లాల్ ఆస్పత్రి వరకు ఇటీవల మంచినీటి పైప్‌లైన్ పనులు పూర్తి చేసి రోడ్డు వేయలేదు. దీంతో ఈ రోడ్డంతా బురదమయంగా మారింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చిక్కడపల్లిలోని బాపూనగర్, వివేక్‌నగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో భారీ చెట్లు నేలకూలాయి. గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ స్పందించి జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ సిబ్బందిని అప్రమత్తం చేశారు.


చిక్కడపల్లిలో కూలిన చెట్లు

లైబ్రరీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం


లైబ్రరీ కార్యదర్శి పద్మజను సత్కరిస్తున్న టీఎన్‌జీవో నేతలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): లైబ్రరీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరు పద్మజ అన్నారు. టీఎన్‌జీవో అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జగదీశ్వరరావు, ముజీబ్ ఆదేశాల మేరకు టీఎన్‌జీవో హైదరాబాద్ యూనిట్ నాయకులు గ్రంథాలయ కార్యదర్శి పద్మజను కలిసి ఆమెను సత్కరించారు. ఆమె గ్రంథాలయ సేవలు అమోఘమన్నారు. చిక్కడపల్లిలోని సిటీసెంట్రల్ లైబ్రరీలో పనిచేస్తున్న ఉద్యోగి, యూనియన్ నేత సుఖేష్‌కుమార్ సెక్షన్ మార్పడం వల్ల ఆయనకు ఇబ్బంది కలుగుతోందని ఆయనను మొదటి సెక్షన్‌కే మార్చాలని కార్యదర్శికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు కింద ట్రెజరీ నుంచి వేతనాలు ఇప్పించే విధంగా కృషి చేయాలని ఆమెను కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు విక్రమ్‌కుమార్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, వరప్రసాద్, మహేందర్, సత్యనారాయణ, సతీష్, శ్రీదేవి, శేఖర్, రామ్‌రెడ్డి, రమేష్, సాయి, సూర్య శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలి


అన్నదాన చేస్తున్న ఎమ్మెల్యే గోపాల్

ముషీరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకుని ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని రెయిన్ బోహోం అనాథాశ్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బాబా బాయి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ... అనాథ పిల్లలకు అండగా నిలిచి వారికి అన్నివిధాలా సహాయసహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహా, పార్టీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, నాయకులు శివముదిరాజ్, ముచ్చకుర్తి ప్రభాకర్, మోహిన్, ఎయిర్‌టెల్ రాజు, పరుశురాం యాదవ్, కొండా సహదేవ్, వహీద్ అలీ, ఫీరోజ్ ఖాన్ పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత సీహెచ్.కర్ణ మృతి


సీహెచ్.కర్ణ (ఫైల్)

ముషీరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే ముఠా గోపాల్ సన్నిహితుడు సీహెచ్.కర్ణ(75) శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు మృతి చెందారు. ఆయన కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి శుక్రవారం మృతిచెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రైల్వే ఉద్యోగి అయిన కర్ణా టీడీపీలో చురుకైన పాత్ర పోషించారు. ఎమ్మెల్యే గోపాల్‌పై ఉన్న అభిమానంతో బీఆర్ఎస్‌లో చేరినప్పటికీ పార్టీ కార్యక్రమాలకు మాత్రం దూరంగా ఉండేవారు. ఆయన మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, యువ నాయకుడు ముఠా జైసింహా, యూత్ కాంగ్రెస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్, ముషీరాబాద్ గంగపుత్ర సంఘం నాయకులు, వివిధ పార్టీ నేతలు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి ధైర్యం చెప్పారు. కర్ణా అంత్యక్రియలు పార్శిగుట్టలోని గంగపుత్ర సంఘం శ్మశానవాటికలో నిర్వహించారు.

కార్మికులు ఈశ్రమ్ కార్డులు తీసుకోవాలి


ఈశ్రమ్ కార్డులు అందజేస్తున్న అబ్దుల్ జవీద్ పాషా

చిక్కడపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గిగ్, ప్లాట్‌ఫార్మ్ కార్మికులకు సామాజికభద్రత కోసం ఈ-శ్రమ్ పథకంలో నమోదు కావాలని సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయసేవాధికారి అబ్దుల్ జవీద్‌పాషా అన్నారు. ఐసీఎఫ్ఏఐ లా స్కూల్, హైదరాబాద్‌కు చెందిన లీగల్ ఎయిడ్ సొసైటీ, జిల్లా న్యాయసేవాధికారి కార్యాలయం, సెషన్స్ డివిజన్, హైదరాబాద్, తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫార్మ్ వర్కర్స్ యూనియన్, తెలంగాణ రాష్ట్ర కార్మికశాఖ ఆధ్వర్యంలో గిగ్, ప్లాట్‌ఫార్మ్ కార్మికుల కోసం సామాజిక భద్రత కోడ్ 2020, ఈ శ్రమ్ కార్డు నమోదు, పంపిణీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి అబ్దుల్ జవీద్ పాషా మాట్లాడుతూ ప్రతి గిగ్, ప్లాట్‌ఫార్మ్ కార్మికుడు ఈ శ్రమ్ పథకంలో చేరి ప్రయోజనాలు పొందాలన్నారు. కొందరు గిగ్ కార్మికులు, ప్లాట్‌ఫార్మ్ కార్మికులకు ఈ శ్రమ్ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొ.అక్బర్ ఖాన్ మాట్లాడుతూ ఈశ్రమ్ పథకం ప్రాముఖ్యత, బీమా అవసరం, ప్రయోజనాలు గిగ్, ప్లాట్‌ఫార్మ్ కార్మికుల భవిష్యత్తుకు ఎలా ఉపయోగపడతాయో వివరించారు.

బీఆర్ఎస్ వరంగల్ సభను జయప్రదం చేయాలి : ఎమ్మెల్యే

అంబర్‌పేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సిల్వర్‌జూబ్లీ సభను జయప్రదం చేయాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే పార్టీ ఆవిర్భావ సదస్సుకు భారీసంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు. మహాసభ సన్నాహాక సమావేశం శుక్రవారం అంబర్‌పేటలోని ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ బీఆర్ఎస్ రజతోత్సవ సభను వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, ఎర్రకోట నర్సింహారెడ్డి, నరేందర్‌ముదిరాజ్, మహేష్‌ముదిరాజ్, మహ్మద్ అతిక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హెబ్రోన్ చర్చిలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ చౌరస్తాలోని భక్తసింగ్ స్థాపించిన హెబ్రోన్ చర్చిలో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. అమెరికా నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన ప్రత్యేక వర్తమానికులు సాల్మన్ ఎబినైజర్ దేవుని వాక్యాన్ని వినిపించారు. చర్చి దైవసేవకులు జోసెఫ్ కురియన్, చర్చి సొసైటీ చైర్మన్ జాన్ సుందరం, దైవ సేవకులు ఇమ్మాన్యుయేల్, మోజెస్, డేవిడ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సామాజిక రుగ్మతలపై ఉద్యమించిన కందుకూరి


నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌గుప్త, జనార్దనమూర్తి తదితరులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సామాజిక రుగ్మతలను సంస్కరించేందుకు కందుకూరి వీరేశలింగం ఉద్యమించారని తెలంగాణ టూరిజం అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఎందరో మహానుభావులు కార్యక్రమాల పరంపరలో భాగంగా నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం యాదిలో పేరిట సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్‌గుప్త మాట్లాడుతూ ఆనాడు సమాజంలో సామాజిక రుగ్మతలను పారదోలేందుకు వీరేశలింగం ఉద్యమించారన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వసాహితి అధ్యక్షుడు జయరాములు, గాయని శ్రీమణి, భమిడిపాటి ఉష తదితరులు పాల్గొన్నారు.

రైల్ మ్యూజియం కళకళ


సందర్శకులతో కాచిగూడ రైల్వే స్టేషన్ డైరెక్టర్ బాలాజీ

బర్కత్‌పుర, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ హెరిటేజ్ డే సందర్భంగా కాచిగూడ రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని రైలు మ్యూజియం ఉచిత ప్రవేశానికి విద్యార్థులు, ప్రయాణికులు పోటెత్తారు. వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో పాటు ప్రయాణికులు కూడా రైలు మ్యూజియాన్ని సందర్శించారు. సెయింట్ పీటర్స్ కాచిగూడ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు ఈ రైలు మ్యూజియాన్ని తిలకించారు. మరో 200 మంది ప్రయాణికులు కూడా మ్యూజియం సందర్శించి రైల్వే విశిష్టతను తెలుసుకున్నారు. ఆనాటి నుంచి నేటి వరకు రైలు ఇంజన్‌లు, సిగ్నలింగ్, మీటర్ గ్రేజి నుంచి బ్రాడ్‌గేజీ పట్టాల వరకు, దక్షిణమధ్య రైల్వే సాధించిన అవార్డులు, రివార్డులు, ఆనాటి టికెట్ల విధానం, 1916లో కాచిగూడ రైల్వే స్టేషన్‌ను నిజాంనవాబ్ మీర్ ఉస్మాన్‌అలీఖాన్ ప్రారంభించిన అరుదైన ఫొటోను ఆసక్తిగా తిలకించారు. రైల్వే స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ విద్యార్థులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

రేపు సీనియర్ జర్నలిస్టు నాగరాజు సంతాప సభ

నల్లకుంట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో మూడున్నర దశాబ్దాలుగా వివిధ పత్రికలు, టీవీ చానెల్స్‌లో జర్నలిస్టుగా పనిచేసిన దివంగత యడ్లపల్లి నాగరాజు సంతాప సభ ఈ నెల 20వ తేదీన చిక్కడపల్లిలోని శ్రీత్యాగరాయగానసభలో నిర్వహిస్తున్నట్లు సీనియర్ జర్నలిస్టు మామిడి సోమయ్య తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు శ్రీత్యాగరాయ గానసభలో జరిగే ఈ సంతాప సభలో సీనియర్ జర్నలిస్టులు హాజరు కావాలని ఆయన కోరారు.

'అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి'

బర్కత్‌పుర, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై కాంగ్రెస్ మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకోవాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి డిమాండ్ చేశారు. నోటికి వచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్ పార్టీని ప్రజలే భూస్థాపితం చేస్తారని ఆయన హెచ్చరించారు. శుక్రవారం బర్కత్‌పురలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కిషన్‌రెడ్డి రాష్ట్రానికి నిధులు తీసుకువచ్చి పలు అభివృద్ధి పనులు చేపడుతుండగా వాటిని చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. అంజన్‌కుమార్‌యాదవ్ క్షమాపణలు చెప్పాలని లేకపోతే ఆయన కార్యక్రమాలను అడ్డుకుంటామని హెచ్చరించారు.

'సోనియా, రాహుల్‌పై ఈడీ కేసులను ఎత్తివేయాలి'

నల్లకుంట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం చట్టం అతిక్రమించి, కాంగ్రెస్ నేతలపై తప్పుడు కేసులు పెట్టి, రాజకీయ లబ్ధే లక్ష్యంగా పనిచేస్తోందని టీపీసీసీ కార్యదర్శి ఎన్.అజయ్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌గాంధీపై ఈడీ చార్జీషీట్‌లో నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కేంద్రంలోని మోదీప్రభుత్వం కాంగ్రెస్ అగ్రనేతలపై రాజకీయ కక్షతోనే అక్రమకేసులు బనాయిస్తోందని విమర్శించారు. దేశ ప్రజలు బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

కంటి అద్దాల వ్యాపారి అదృశ్యం

బర్కత్‌పుర, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కాచిగూడలో కంటి అద్దాల వ్యాపారి అదృశ్యమయ్యాడు. కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్ఐ డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... చప్పల్‌బజార్‌లో నివాసం ఉంటున్న సురేందర్(31). కంటి అద్దాల వ్యాపారం చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన సురేందర్ తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికిన ఆయన ఆచూకీ లభించలేదు. భార్య ప్రియాంక శుక్రవారం కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాచిగూడ నూతన ఏసీపీగా బాలగంగిరెడ్డి



బర్కత్‌పుర, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : తూర్పుమండలం పరిధిలోని కాచిగూడ నూతన ఏసీపీగా బాలగంగిరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో అంబర్‌పేట డీఐగా పలు పోలీస్ స్టేషన్లలో సీఐగా బాధ్యతలు నిర్వర్తించారు. సుల్తాన్‌బజార్ ఏసీపీగా ఆయన పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా రాజరాజేశ్వరి ఆలయ వార్షికోత్సవం

చిక్కడపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి బాపునగర్‌లోని రాజరాజేశ్వరి దేవాలయం ఆధ్వర్యంలో ఆలయం వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం జరిగిన ప్రత్యేకపూజల్లో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బీజేపీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్, సీనియర్ నాయకులు రత్నసాయిచంద్, దామోదర్, శ్రీకాంత్, నర్సింగ్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు అందేల్ రాజు, మహేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ డా.వెంకట్‌రాంనర్సయ్య మృతి



చిక్కడపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా ప్రసిద్ధిచెందిన డా.వెంకట్‌రాంనర్సయ్య(82) గురువారం రాత్రి చిక్కడపల్లిలోని ఆయన నివాసంలో మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతున్నారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. వృత్తి డాక్టర్ అయినప్పటికీ ప్రవృత్తి మాత్రం ఫ్యాషన్, వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ. ఫొటోగ్రఫీలో ఎంపీ మాజీ సీఎం దిగ్విజయ్‌సింగ్‌కు ఈయన గురువు. గతంలో సెంట్రల్ యూనివర్సిటీలో ఆయన వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. పులుల మీద తీసిన ఫొటోలు ఆయనకు పేరు తెచ్చాయి. ఆయన పులులమీద ఓ పుస్తకం కూడా రాశారు. శుక్రవారం వెకంట్‌రాంనర్సయ్య అంత్యక్రియలు అంబర్‌పేట శ్మశానవాటికలో ఆయన కుమార్తె నిర్వహించారు.